అండగా ఉంటాం

మూసీ పరీవాహక ప్రాంతవాసులకు బీఆర్‌ఎస్ భరోసా



మాజీమంత్రి కేటీఆర్‌ను సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్‌: మూసీ పరీవాహక ప్రాంతాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉండి ఆ ప్రజల ఇండ్లు కూల్చకుండా కృషి చేస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేత ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని మూసీ ఒడ్డున ఉన్న చంద్రకిరణ్ బస్తీ, చుడిబజార్, దేవీనగర్, శంకర్‌నగర్, ఉప్పలమ్మ టెంపుల్ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తామన్నారు. మంగళవారం మాజీమంత్రి కేటీఆర్‌ను ఆనంద్‌కుమార్ గౌడ్ ఘనంగా సత్కారం చేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మూసీ ప్రజల సమస్యలను కేటీఆర్‌కు వివరించారు. కేటీఆర్ స్పందించి మూసీ పరీవాహక ప్రాంతాలకు బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మజ్లిస్ నేతలకు సూచించిన ఎమ్మెల్యే



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, ఏరియా కమిటీ సభ్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు.మంగళవారం ఆయన టోలీచౌకిలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాల్సిన బాధ్యత ఆయా ఏరియా కమిటీ ప్రతినిధులదేనని అన్నారు. ఒక వైపు సమస్యలు పరిష్కరిస్తునే, మరోవైపు సేవా కార్యక్రమాలను కూడా మజ్లిస్ పార్టీ చేస్తున్నదని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తమ పార్టీ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొహమ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరుఫ్ ఫరాన్, అజీజ్ ఖాన్ పఠాన్, అబిన్ అవ్వద్, యూనుస్ తదితరులు ఉన్నారు.

ప్రజాసేవ చేసేవారికి గుర్తింపు



ఖాలేద్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న మొహమ్మద్ నజీబ్

లంగర్‌హౌస్: ప్రజాసేవ చేసేవారిని సమాజం గుర్తించి గౌరవిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఏహెచ్ఆర్‌ఓ పీస్ అంబాసిడర్ మొహమ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం సీనియర్ మజ్లిస్ నాయకుడు, సంఘసేవకుడు ఖాలేద్ అలిఖాన్‌కు టోలిచౌకిలో ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాలేద్ అలిఖాన్ రాజకీయంగానే కాకుండా సామాజసేవకునిగా గుర్తింపు పొందారన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ వారికి సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలో తాము చేపట్టిన సేవా కార్యక్రమాల్లో ఖాలేద్ ఎంతగానో సహకరించారన్నారు. సుమారు ఆరు నెలలపాటు కోవిడ్‌లో వరుస కూలీలకు ప్రతి నిత్యం రెండు పూటల భోజనం అందించగా ఈ గొప్ప కార్యంలో ఖాలీద్ చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ మొహమూద్ అలీ, మొహమ్మద్ ఇస్మాయిల్, సమీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ జూడాలకు మద్దతుగా ఐఎంఏ దీక్ష



దీక్ష నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: పది రోజులుగా బెంగాల్‌లోని జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు ఐఎంఏ రాష్ట్ర శాఖ మద్దతు ఇస్తోందని అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాద్‌రావు, సెక్రటరీ జనరల్ డాక్టర్ కె.విజయ్‌రావు తెలిపారు. బెంగాల్ డాక్టర్ల దీక్షకు మద్దతుగా మంగళవారం కోఠిలోని ఐఎంఏ రాష్ట్ర కార్యాలయం ముందు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగాల్‌లో ముగ్గురు వైద్యుల ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వైద్యుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను తక్షణమే తొలగించాలన్నారు. ఆ రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులు, వైద్య కళాశాలల కోసం కేంద్రీకృత రిఫరల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డిజిటల్ బెడ్ వేకెన్సీ మానిటర్ సిస్టం అమలు పరచాలని కోరారు. ఆసుపత్రుల్లో పోలీసు రక్షణ పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్, వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దయాల్‌సింగ్, డాక్టర్ రాహుల్, డాక్టర్ దీపాంకర్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ చంద్రిక, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ జె.రామ్మోహన్, డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టడం హర్షణీయం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వెంకటేశ్

గౌలిపురా: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మేరు సంఘం రాష్ట్ర నేత కె.వెంకటేశ్ అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే తక్షణమే ప్రారంభించి 60 రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వెంకటేశ్ కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఇందిరమ్మ పాలనను గుర్తుచేస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి నిర్ణయంతో బీసీలంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. బీసీ కులగణన తరువాత జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

శిథిలావస్థలో పురానాపూల్

- పట్టించుకోని ఆర్కియాలజీ విభాగం
- మరమ్మతు చేసి పర్యాటక ప్రాంతంగా గుర్తించాలంటున్న స్థానికులు

జియాగూడ: చరిత్రాత్మక పురానాపూల్‌ను మూసీ నదిపై నిర్మించి 400 సంవత్సరాలు దాటాయి. ఈ వంతెన ప్రహరీల శిలలు కూలిపోతున్నాయి. దీంతో అది ప్రమాదకరంగా మారుతోంది. వంతెనపైనున్న ఫుట్‌పాత్‌ను పలువురు ఆక్రమించి ఇరుపక్కల కూరగాయలు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. వాటికి సంబంధించిన చెత్తాచెదారం వంతెన పైనుంచి మూసీ నదిలో పడేస్తున్నారు. వంతెన ప్రహరీపైనే షెడ్డులు వేసుకొని వ్యాపారాలు నిర్వహించడం వల్ల బ్రిడ్జి శిలలు కూలి పడిపోతున్నాయి. పలుచోట్ల పెద్ద ఎత్తున రంధ్రాలు కూడా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. వంతెనను అభివృద్ధి పరిచి పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని విన్నవిస్తున్నారు. ప్రేమికుల వారధిగా ప్యారానాపూల్‌గా పేరుగాంచిన ఈ వంతెన ప్రస్తుత పరిస్థితి దయనీయంగా మారింది. అయినప్పటికీ వంతెన అభివృద్ధి కోసం ఆర్కియాలజీ విభాగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వంతెనపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. చారిత్రక కట్టడాన్ని రక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఆర్కియాలజీ విభాగానిదే. ఇకనైనా అధికారులు పురానాపూల్ వంతెనను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



కూలిన పురానాపూల్ వంతెన ప్రహరీ

అక్కడ స్టేషన్.. ఇక్కడ పరేషాన్!

- పాతబస్తీలో ఉండాల్సిన పోలీసుస్టేషన్లు ఎక్కడో దూరంగా..
- ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు
- స్థానికంగానే ఉండాలంటున్న ప్రజలు



మలక్‌పేట్‌లో ఉన్న సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్



మలక్‌పేట్‌లో కొనసాగుతున్న చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్

చార్మినార్: ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది దూరంగా ఉంటున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఆయా ప్రాంతాల్లో ఉండాల్సిన అధికార యంత్రాంగం ఎక్కడో దూరంగా కొనసాగుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులను కలిసి తమ ఫిర్యాదులతో పాటు సమస్యలను విన్నవించుకోవడం గగనమవుతోంది. పాతబస్తీలోని సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌తోపాటు చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు పాతబస్తీలో కాకుండా మలక్‌పేట్‌లో కొనసాగుతున్నాయి. పాతబస్తీలోని దక్షిణ మండలం, తూర్పు దక్షిణ మండలం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌తోపాటు చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిపాలనా భవనాలు తూర్పు మండలం పరిధిలో కొనసాగుతున్నాయి. చార్మినార్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ గత కొన్నేళ్లుగా మలక్‌పేట్‌లోని బి బ్లాక్‌లో కొనసాగుతుండగా, పునర్విభజన సందర్భంగా కొత్తగా ఏర్పాటైన సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ కూడా మలక్‌పేట్‌లోని బి బ్లాక్‌లోనే ఉంది. ఈ రెండింటి ఏరియాలు మాత్రం పాతబస్తీ పరిధిలోని దక్షిణ మండలం, తూర్పు దక్షిణ మండలంలో ఉన్నాయి. బాధితులుగానీ, ఫిర్యాదుదారులు గానీ ఆయా పోలీసు స్టేషన్లకు చేరుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో ఫిర్యాదు చేయడం కోసం వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా లేదు.

చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో...

గతంలో పాతబస్తీ సిటీ కాలేజీ చౌరస్తాలోని కుడా స్టేడియం పక్కన ఉన్న చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మలక్‌పేట్‌కు తరలించారు. వాస్తవానికి ఈ స్టేషన్ పరిధిలో చార్మినార్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, ఛత్రినాక ఏసీపీల పరిధిలోని లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్లతో పాటు మీర్‌చౌక్ పోలీసుస్టేషన్ పరిధి కూడా ఈ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. నాలుగు లా అండ్ ఆర్డర్ ఏసీపీల పరిధిలోని ఏదో ఒకచోట ఎక్సైజ్ స్టేషన్ ఉండాలి.

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో...

గతంలో దక్షిణ మండలం పరిధిలో ఉన్న కొన్ని ఏరియాలతో కొత్తగా తూర్పు దక్షిణ మండలాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసి మలక్‌పేట్‌లోని బి బ్లాక్‌లో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. పునర్విభజన అనంతరం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ భవనం తూర్పు మండలంలోని మలక్‌పేట్ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉంది. ఇక్కడి నుంచే సంబంధిత ట్రాఫిక్ పోలీసులు తమ విధి నిర్వాహణ కొనసాగిస్తున్నారు. దీని పరిధిలో సైదాబాద్, మాదన్నపేట్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ తదితర 4 లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధిలోని ఏరియాలు వస్తాయి. ఈ ఏరియాలకు సంబంధించిన వాహనదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి మలక్‌పేట్‌కు రావాల్సి వస్తోంది. తమ ఏరియాలోనే స్టేషన్ ఉండేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను స్థానికులను కోరుతున్నారు.

పుష్ప విలాపం

గుడిమల్కాపూర్‌లో గిరాకీ లేక పారబోత




గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో చెత్తకుప్పల్లా పువ్వులు

గోల్కొండ: పండుగల సీజన్ ముగియడంతో పువ్వులకు డిమాండ్ బాగా తగ్గింది. వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగల సమయంలో పూలరేట్లకు రెక్కలు వచ్చాయి. అయితే పండుగలు ముగియడంతో పూల గిరాకీ తగ్గింది. రాష్ట్రంలో అతి పెద్ద పూల మార్కెట్ అయిన గుడిమల్కాపూర్ ఇంద్రారెడ్డి మార్కెట్‌లో ధరలు తగ్గినా పూలు అమ్ముడు పోవట్లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాయంత్రం వరకు చూసి అమ్ముడుపోని పూలను మార్కెట్‌లోని చెత్తకుప్పల్లో పారవేస్తున్నారు.

వేర్వేరు సంఘటనల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురికి జైలు

గౌలిపురా: వేర్వేరు సంఘటనల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురికి జైలు శిక్ష పడింది. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం...సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన మహ్మద్ యాసిన్ ఖురేషి (36), తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీమ్(25), మహ్మద్ సర్ఫరాజ్ (20), సయ్యద్ సాజిద్ (24), రియాసత్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం (25) వేర్వేరు సంఘటనల్లో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరందరిని మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా, పూర్వాపరాలను పరిశీలించిన స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డి.సి.ఉమాపతిరావు ఐదుగురు నిందితులకు 14 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



లంగర్‌హౌస్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ..... లంగర్‌హౌస్ బాపూఘాట్ పక్కన శ్మశాన వాటిక వద్ద మూసీలో మంగళవారం ఉదయం 55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా అతని జేబులు 70 రూపాయలు, బస్ టికెటు తప్ప ఆధారాలు ఏమి లేవు. చుట్టుపక్కల వాకబు చేయగా అతను సోమవారం సాయంత్రం బాపూఘాట్ బస్టాప్ వద్ద కూర్చొని పలువురితో మాట్లాడినట్లు తెలిసింది. అనంతరం సంగం ఆలయంలోకి వెళ్లి అక్కడ పూజల్లో పాల్గొన్నాడు. తదనంతరం మద్యం తెచ్చుకొని తాగి మంగళవారం ఉదయం మూసీలో శవమై కనిపించాడు. మృతుడి ఒంటిపై గులాబి రంగు షర్టు, ముదురు నీలిరంగు ప్యాంటు ఉన్నాయి. మృతుడి సంబంధీకులు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పిల్లి గుడిసెలలోని పాతవారికీ రుణాలివ్వాలి



అధికారులను కోరుతున్న సయ్యద్ మస్తాన్

చార్మినార్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పిల్లి గుడిసెలు టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలోని పాత వారికి సైతం సెల్ఫ్ హెల్ప్ గ్రూప్(ఎస్‌హెచ్‌జీ)ల ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ అధికారులను కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో శంకర్‌నగర్ బస్తీ మూసీ నిర్వాసితులకు(స్వయం సహాయక బృందాలకు) వడ్డీ లేని రుణాలను అందజేయడానికి జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అలాగే పిల్లి గుడిసెల కాలనీ డబుల్ బెడ్‌రూంలో ఇప్పటికే నివాసం ఉంటున్న పాత వారికి సైతం ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. ఇక్కడ ఇప్పటికే ఎస్సీ మాదిగ కులానికి చెందిన పేద దళితులతోపాటు ముస్లిం మైనార్టీ ప్రజలు జీవిస్తున్నారన్నారు. వీరిలో అర్హులైన వారిని గుర్తించి స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసి రుణాలను అందించాలని ఆయన మంగళవారం జీహెచ్ఎంసీ సర్కిల్–6 యూసీడీ విభాగం ప్రాజెక్ట్ అధికారి యుగందర్‌రెడ్డిని కలిసి కోరారు.

ప్రభుత్వ స్కూల్ నిర్మాణం ఎప్పుడో?

- జియాగూడ 2 బీహెచ్‌కే వాసుల ఎదురుచూపులు
- 2018లో భూమి పూజ.. ముందుకు కదలని పనులు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు



ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

జియాగూడ: జియాగూడలోని 2 బీహెచ్‌కేలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ బౌలి గులాబ్‌సింగ్ బిల్డింగ్ కోసం స్థలం కేటాయించినా నిర్మాణం అతీగతీలేదు. జియాగూడలోని ఈ పాఠశాల భవనం ఈబీహెచ్‌కే క్వార్టర్స్ మధ్యలో ఉండేది. కాగా, అప్పట్లో 2 బీహెచ్‌కే బిల్డింగ్ కోసం స్కూల్ స్థలాన్ని అధికారులు తీసుకున్నారు. అంబేద్కర్ భవన్ ఆటస్థలం పక్కన స్కూల్ బిల్డింగ్ కోసం స్థలాన్ని కేటాయించారు. అప్పటి కార్పొరేటర్ సైతం 2018లో భూమి పూజ నిర్వహించారు. అయితే, స్కూల్ బిల్డింగ్ నిర్మాణం మాత్రం జరగలేదు. ఆ తరువాత దాని గురించి పట్టించుకునేనాథుడే లేడు. ఈ విషయమై పలుమార్లు అసోసియేషన్ వారు ఎమ్మార్వో, స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను కలిసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో ఈ స్థలం నిరూపయోగంగానే ఉంది. మరోవైపు ఈ స్థలాన్ని కబ్జాచేసుందుకు ఆక్రమణదారులు కన్నేశారు. ఈ స్థలంలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ నిర్మిస్తే 2 బీహెచ్‌కేలో నివాసం ఉంటున్న కుటుంబాల పిల్లలకు, పరిసరాల సంజయ్ నగర్, డోర్‌బస్తీ, ఇమాంపురా తదితర ప్రాంతాల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుంది. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు స్థలం ఉన్నచోట పర్మనెంట్ బిల్డింగ్ నిర్మిస్తే బావుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు.

సీబీఐటీలో 21నుంచి బూట్‌క్యాంప్

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈనెల 21 నుంచి 25 వరకు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్‌పై బూట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. క్యాంప్ పోస్టర్‌ను అధ్యాపకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఔరంగాబాద్ సహకారంతో 5 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అనేది డిజిటల్‌తో పరస్పర చర్య చేయడంలో మానవ చర్యలను అనుకరించేందుకు సాఫ్ట్‌వేర్ రోబోలు, బాట్‌లు ఉపయోగించి పునరావృతమయ్యే పనులను ఆటోమేషన్ చేసే సాంకేతికతపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు కే గంగాధర్‌రావు, పీ. రమేశ్‌బాబు, డాక్టర్ టీ. సత్యనారాయణ మూర్తి, డాకట్ర్ బబీ. స్వాతిసౌమ్య, ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం. వేణుగోపాలాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

రాజేంద్రనగర్: ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేదలకు భూములు, ఇండ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలే వ్యవసాయ కార్మికులు, కూలీలుగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ముందుగా భూపంపిణీ చేపట్టాలని దానికోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూపోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరముందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎర్రజెండా ఎప్పుడూ పేదలకు అండగా ఉంటుందని.. దాని కోసం కార్యకర్తలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి నిత్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరమ ఉందని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 29, 30వ తేదీల్లో రాష్ట్ర సమితి సమావేశాలు శంషాబాద్‌లో నిర్వహించి మొదటిరోజు రాష్ట్ర స్థాయి సెమినార్ కూడా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం, రాజేంద్రనగర్ మండల సీపీఐ కార్యదర్శి ఎండీ రియాజ్, టి.నరసింహా రెడ్డి, శివాల లక్ష్మయ్య, గాలయ్య, రాములు, స్వరూప పాల్గొన్నారు.

అర్చక పురస్కారం ప్రదానం



శ్రీనివాసాచార్యులను అర్చక పురస్కారంతో సత్కరిస్తున్న మధుసూదనాచారి

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదీగల శ్రీనివాసాచార్యులు అర్చక పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాజ గానసభలో పినాకిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసాచార్యులకు మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పురస్కారం అందజేశారు. ఆయనను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు.

మీరాలంమండి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చార్మినార్: దేవీ శరన్నవరాత్రి వేడుకలను భక్తి శ్రద్ధలతో పూర్తి చేయడానికి సహకరించిన అధికార యంత్రాంగంతోపాటు భక్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మంగళవారం తన సతీమణి చంద్రకళతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా సహస్రనామ దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ, తిరువీధి సేవ, సామూహిక సహస్రనామ కుంకుమార్చన తదితర పూజలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగాయన్నారు. ఈ పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులతోపాటు వేద పండితులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అందరికీ అమ్మవారి ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉంటాయని, ఇదే విధంగా రాబోయే రోజుల్లో కూడా అందరి ఆదరణ ఉండాలని అన్నారు.

19న జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లకు ఇంటర్వ్యూలు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు డాక్టర్లకు ఈ నెల 19న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) రంగారెడ్డి జిల్లా డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2025 మార్చి 30 వరకు పని చేసేందుకు స్పెషలిస్టులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఓబీజీ, జీఎం, జీఎస్, ఆర్థో, రేడియాలజీ, జీడీఎంఓ తదితర విభాగాలలో పని చేసేందుకు 20 మంది డాక్టర్లు అవసరమని రంగారెడ్డి జిల్లాలోని టీవీవీపీ ఆస్పత్రులలో పని చేయాల్సి ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకున్న డీఈ రమేశ్‌చంద్ర

మణికొండ: నార్సింగిలోని డీఈ కార్యాలయంలో ఇబ్రహీంబాగ్ డివిజన్ విద్యుత్ శాఖ ఇంజినీర్‌గా రమేశ్ చంద్ర మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డీఈ శివశంకర్ రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డీఈ (టెక్నీకల్)గా బదిలీ కాగా ఆయన స్థానంలో రమేశ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తమ దృష్టికి తీసుకు వస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని, వినియోగదారులు కూడా సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు. అంతకుముందు డీఈకి ఏడీఈలు అంబేడ్కర్, రాజేశ్, సహాయ ఇంజినీర్లు నరేందర్, జానీ మొహినుద్దీన్, దుర్గాప్రసాద్, సంతోష్, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎం. భాస్కర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.

మున్సిపాలిటీలో పనులు సక్రమంగా జరగడం లేదు

మణికొండ: మున్సిపాలిటీలో సకాలంలో పనులు జరగడం లేదని, చేసిన పనుల్లో నాణ్యత ఉండడం లేదని మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) వీపీ గౌతమ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల దుస్థితి, వీధి దీపాల పరిస్థితిని కమిషనర్‌కు వివరించారు. నాణ్యత లేని వీధి దీపాలు అమర్చడం వల్ల రెండు, మూడు రోజులకే పాడై పోతున్నాయని వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అందించిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్‌రావు, ఎస్, శ్రీకాంత్, షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.